




ఈసారైనా.. 'గూడు' కుదిరేనా?

పదేళ్లుగా పేదోడికి సాకారం కాని సొంతింటి కల

- గత ప్రభుత్వంలో అందని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కాంగ్రెస్ సర్కారు చేయూత
- సొంత స్థలముంటే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం
- విడతలవారీగా లబ్ధిదారుల ఖాతాలో జమచేయనున్న ప్రభుత్వం
- రేపు పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తొలివిడతలో ఉమ్మడి జిల్లాకు రానున్న 50వేలకు పైగా ఇందిరమ్మ ఇల్లు

వరంగల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేదోడి సొంతింటి కల కలగానే మిగిలింది. ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటిని నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలే అయ్యాయి. గత ప్రభుత్వం అర్హులందరికీ విడతల వారిగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మించి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అమలు నోచుకోలేదు. గత ఏడాది గృహలక్ష్మీ పేరుతో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో ఆ పథకం ముందుకు సాగలేదు. దీంతో పదేళ్లుగా సొంత ఇళ్లు కలగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాగా ఉంటే రూ.5లక్షల సాయంతో సొంతింటి నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుంది. దీంతో పేదోడికి సొంతింటిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

2014లో బీఆర్ఎస్ పార్టీ సింగల్ బెడ్‌రూమ్‌తో పేదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది ప్రతీ నియోజకవర్గానికి 500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించింది. 2016-19 వరకు మూడేళ్లలో మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32వేల డబుల్ ఇళ్లు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి చందులాల్, స్పీకర్ మధుసూదనాచారితో పాటు కొంత మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు అదనంగా డబుల్ ఇళ్లను మంజూరు చేయించుకున్నారు. అయితే డబుల్ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగాయి. వరంగల్ అర్బన్ జిల్లాలో చేపట్టిన 4,784 ఇళ్లలో సగం కూడా పూర్తి కాలేదు. కొన్నిచోట్ల డబుల్ ఇళ్లు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా తాత్సారం చేశారు. భూపాలపల్లి జిల్లాలో 3,882 ఇళ్లు మంజూరు అయితే 1,500 నిర్మాణాలు పూర్తి అయ్యాయి. భాస్కర్‌గడ్డలో ఉన్న 9,940 ఇళ్లు పంపిణీ చేసినప్పటికీ ఆ ఇళ్లలో కనీస వసతులు లేక నిరుపయోగంగా మారుతున్నా యి. మహబూబాబాద్ జిల్లాలో 5,571 ఇళ్లు మంజూరి కాగా, 1,733 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డబుల్ ఇళ్లు ట్రబుల్‌గా మారటంతో సొంతింటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో గత ప్రభుత్వం 2020-21లో సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తా మని ప్రకటించింది. అయితే ఆ పథకం అమలుకు నోచుకోలేదు. 2023-24లో గృహలక్ష్మీ పేరుతో సొంత జాగాలో ఇళ్లు నిర్మించుకుంటే రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,58,090 మంది దరఖాస్తులు రాగా, అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిన చేసింది. ఇందులో 1,91,240 మంది అర్హులుగా గుర్తించింది. అయితే తొలి విడతలో నియోజకవర్గానికి 3వేల ఇళ్లే ప్రభుత్వం కేటా యించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 30వేల గృహలక్ష్మీ ఇళ్లు మంజూరయ్యాయి. ములుగు, హనుమ కొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందించారు. అయితే ఎన్నికల కోడ్ రావటంతో గృహలక్ష్మికి బ్రేక్ పడింది. అటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందక, ఇటు గృహలక్ష్మీ పథకం ద్వారా సొం తింటి కల ఆవిరి కావటంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదేళ్లలో 5వేల మందికి కూడా పూర్తిస్థాయిలో సొంత ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనివ్వలేదనే విమర్శలు ఉన్నాయి. పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూపులే మిగిలాయి తప్ప.. కల సాకారం కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

వైఎస్ హయాంలో..

సొంతిల్లు పేదోళ్ల కల. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో సొంతింటిని నిర్మించుకోవాలని ఎంతోమంది పేదలు ఎదురుచూస్తున్నారు. 2014కు ముందు కాం గ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపె ట్టింది. చాలా గ్రామాల్లో ఇందిరమ్మ కాలనీలను ఏర్పా టు చేసి, సొంతింటిని నిర్మించి ఇచ్చింది. జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు ఆయా సామజికవర్గాలను బట్టి ఆర్థికసాయం అందించింది.

ఇందిరమ్మ ఇళ్ల పథకంతో..

పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన అర్హులైన పేదలకు కొత్త ప్రభుత్వం గూడుపై గుడ్‌న్యూస్ చెప్పింది. తొలి దశలో సొంతంగా జాగా ఉంటే ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేస్తా మని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత సొం తంగా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇందిరమ్మ కాలనీ లను ఏర్పాటు చేయనుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీలను ప్రకటించింది. అందులో ఇందిరమ్మ



▶▶ మిగతా 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లాకు 50వేలకు పైగా ఇళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి విడతలో 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు అందనున్నాయి. ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి తొలివిడతలో 3,500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42వేల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానున్నాయి. అలాగే భూపాలపల్లి జిల్లాలో మంథని నియోజకవర్గంలోని సగానికి పైగా మండలాలు ఉన్నాయి. అలాగే ములుగు జిల్లాలో భద్రాచలం నియోజకవర్గంలోని రెండు మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో ఇల్లందు నియోజకవర్గంలోని రెండు మండలాలు, హనుమకొండ జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాలు, హుజురాబాద్ నియోజకవర్గంలో ఒక మండలం కలిసి ఉంది. ఈ మండలాల్లో కూడా సుమారు 8వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కొక్క ఇంటికి రూ.5లక్షల చొప్పున మొత్తం 50వేల ఇందిరమ్మ ఇళ్లకు రూ.25వేల కోట్లు ఖర్చు చేయనున్నారు.

జూన్ 30 నాటికి పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 9: జూన్ 30వ తేదీ నాటికి గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా మంజూరైన పనులన్నింటినీ పూర్తి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. శనివారం హనుమకొండలోని ఆయన నివాసంలో నియోజకవర్గ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్ల సౌకర్యం లేని తండాలకు, గ్రామ పంచాయతీలకు రూ.40కోట్ల విలువైన 33 రోడ్లను మంజూరు చేశారని, నూతనంగా ఏర్పడిన జీపీలలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని అన్నారు. అంతేకాకుండా నియోజకవర్గకేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను అధికారులు, కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మంజూరైన నిధులు సరిపోక పోతే ఎస్టిమేషన్‌లు రూపొందించి అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలో బంజారభవన్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించేలా చూస్తానని తెలిపారు. ఘన్‌పూర్‌లోని గిరిజన ఆశ్రమపాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రతిపాదలను తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఏఈ పుల్లయ్య, వేలేరు ఎంపీపీ చాడ సరిత, నాయకులు మారుజోడు రాంబాబు, రాజేష్‌నాయక్, స్వామినాయక్, ఇల్లెందుల సుదర్శన్, బొమ్మిశెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ ఘట్టం.. అగ్నిగుండ ప్రవేశం

ఓంకారనాదంతో మారుమోగిన సిద్ధులగుట్ట

లింగోద్భవ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట, మార్చి 9: "హరహర మహాదేవ శంబో శంకరా.. కోరిన వరాలిచ్చే కొడవటూరు సిద్ధేశ్వరా... ఆపద మొక్కులవాడా ఆది దేవుడా.. శరణు.. శరణు.." అంటూ దిక్కులు పిక్కటిల్లేలా వేలాది మంది భక్తులు చేసే శరణు ఘోష మధ్య సిద్ధేశ్వరాలయ ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, అర్చక బృందం, పలువురు భక్తులు బ్రహ్మోత్సవాలలో అతి ముఖ్యమైన అగ్నిగుండ ప్రవేశం చేశారు. శుక్రవారం రాత్రి వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించిన అనంతరం సామూహిక రుద్రాభిషేకాలు జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమంలో శివలింగాన్ని



లింగోద్భవ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అభిషేకం చేసేందుకు వందలాదిగా భక్తులు పోటీపడ్డారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి లింగోద్భవ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివుడి అనుగ్రహంతో తెలంగాణాలో అంతా మంచే జరగాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం వీరభద్రుని జనన్ని పురస్కరించుకుని అధికారులు, పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు బియ్యంసుంకు జరిపి, భద్రకాళికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అగ్నిగుండ ప్రజ్వలన చేశారు. కణకణమండే నిప్పు కణికలను పేర్చి శనివారం తెల్లవారు జామున అష్టదిక్పాల పూజలు, బలిహరణం, అగ్నిపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో శివకల్యాణం తరువాత అపూర్వ ఘట్టంగా భావించే అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ దృశ్యాలను తనివితీరా వీక్షించేందుకు తరలివచ్చిన వేలాది మంది భక్తజనం జయజయ ధ్వానాలతో హోరెత్తించగా, ప్రధాన పూజారితో పాటు అర్చకులు నిప్పు కణికలపై నడవగా, పలువురు పరమశివుని భక్తులు వారిని అనుసరించారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ఈవో చిందం వంశీ, ఉత్సవ కమిటీ చైర్మన్ గాలి కృష్ణ, ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి, అర్చకుల సమక్షంలో నిర్వహించిన గెలుపు ఆశీర్వాద కార్యక్రమంతో గత నాలుగు రోజులుగా జరిగిన బ్రహ్మోత్సవాలకు తెరపడింది. బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరపడానికి డీసీపీ సీతారం సూచనల మేరకు ఏసీపీ దామోదర్‌రెడ్డి, సీఐ సాయిరమణ, ఎస్ఐ సతీష్‌లు భారీ బందోబస్తు చేపట్టారు. వీరికి ఎన్‌సీసీ స్టూడెంట్‌లు, స్థానిక యువత సహకరించారు. సిబ్బంది చల్లా రాజేందర్ రెడ్డి, మధు, లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు.



సిద్ధుగుట్టలో అగ్నిగుండంలో నడుస్తున్న పూజారులు

వేడుకగా బుగులు వెంకన్న వార కల్యాణం

- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



వెంకన్న ఆలయంలో వార కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, మార్చి 9 : చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వెంకటేశ్వరుడి వార కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, పూజారులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వెంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ తంతును వైభవంగా ముగించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, స్వామివారి నిత్యసేవకులు, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు - కిరణ్మయి దంపతులు, కృష్ణమాచార్యులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు

జనగామ టౌన్, మార్చి 9: హైదరాబాద్ జిల్లాలో 108 అంబులెన్సులో పని చేసేందుకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ జనగామ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ(బైపీసీ), ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణులై 30 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11న సోమవారం ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో జనగామ జిల్లా ఆస్పత్రి 108 కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 80089 35522 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

శోభాయమానంగా సోమన్న రథోత్సవం

- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు
- గుట్ట చుట్టూ తిరిగిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు



పాలకుర్తిలో సోమన్న రథోత్సవం

పాలకుర్తి, మార్చి 9: సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో మూడో రోజు శనివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి శివపార్వతులు, లక్ష్మీనర్సింహస్వామి వారి కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం రథాన్ని వివిధ రంగు రంగుల పూలతో అలంకరించగా పూజారుల వేదమంత్రాల మధ్య ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని దేవస్థానం గుట్ట నుంచి గుడివాడ చౌరస్తా, గ్రామ పంచాయతీ, హనుమాన్ వీధి, జ్యోతిరావు పూలే చౌరస్తా, రాజీవ్ చౌరస్తా మీదుగా రథోత్సవాన్ని పద్మశాలీలు తీసుకొస్తుండగా భక్తులు మంగళహారతులతో కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సూర్యాపేట జిల్లా బేతవోలుకు చెందిన మహిళలు కోలాటాలు, నృత్యాలు, పాటలతో అలరించారు. గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలు చేసి భక్తిని చాటుకున్నారు.

రాత్రి రథోత్సవం ఆలయానికి చేరింది. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య నేతృత్వంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సాయి ప్రసన్నకుమార్, ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంకటయ్య, డీవీఆర్ శర్మ, అనిల్, నాగరాజు, కమిటీ సభ్యులు కృష్ణమాచార్యులు, పన్నీరు వెంకన్న, సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 9: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామ శివారు ముత్యాలమ్మ తండాకు చెందిన కేలోతు కిషన్ (38) నాటు కోళ్ల విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తాళ్లపూసపల్లి నుంచి మహబూబాబాద్‌కు సొంత పనినిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో అయోధ్య గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కిషన్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

అవకాశం కల్పించండి

హనుమకొండ చౌరస్తా, మార్చి 9: బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిమల్లె సదానందం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా, ఉద్యమకారుడిగా సేవలు చేశానన్నారు.

ఉద్యమకారులకే బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి..

- అరూరి రమేశ్, కడియం కావ్యకు ఇవ్వొద్దు
- ఉద్యమకారుల డిమాండ్.. పసునూరి ఆధ్వర్యంలో రహస్య భేటీ


భేటీలో పసునూరితో ఉద్యమకారులు

వరంగల్ క్రైం, మార్చి 9: రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన అరూరి రమేశ్‌కు, పార్టీ ప్రాథమిక సభ్యత్వం కూడా లేని కడియం కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పార్టీ కోసం పనిచేస్తున్న తమలో ఒకరికి అవకాశం కల్పించాలని వారు స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. శనివారం రాత్రి హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఒక కన్వెన్షన్‌లో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ ఆధ్వర్యంలో ఉద్యమకారులు జోరిక రమేశ్, వీరేందర్, బోడ డిన్నా, చింతల యాదగిరి, బండి రజనీకుమార్, ఎం.శ్రీనివాస్, సదానందం రహస్య భేటీ నిర్వహించారు.

వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చే విషయంలో పార్టీ అధిష్ఠానం ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న తనను పరిగణలోకి తీసుకోకపోవడంపట్ల పసునూరి దయాకర్ అసహనంతో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఉద్యమకారులతో పసునూరి దయాకర్ భేటీ నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌లో ఉన్నవారిలో ఉద్యమ సమయం నుంచి కొనసాగిన ఏకైక వ్యక్తినని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తనను పార్టీ ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిన్నమొన్న వచ్చిన వారికి పార్టీ పెద్దపీట వేస్తోందని పేర్కొనట్లు సమాచారం. భేటీ అయిన వారిలో ఎవరికి ఇచ్చినా తాను సహకరిస్తానని, వారి గెలుపునకు తనవంతు సహకారం అందిస్తానని పసునూరి తెలిపినట్లు తెలిసింది. ఒక వేళ తనకు అవకాశం వచ్చినట్లైతే ఉద్యమకారులకు పార్టీలో సముచిత స్థానం దక్కేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

రహస్య భేటీకి హాజరైన ఉద్యమకారులు తమలో ఎవరికి అవకాశం కల్పించినా ఐక్యంగా ఉండి గెలిపించుకుంటామని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ నిర్ణయాన్ని పార్టీ పరిగణలోకి తీసుకోనట్లైతే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుందామని, ఉద్యమకారులకు గౌరవం ఇచ్చే సంస్థలోకి వెళదామని పలువురు ఉద్యమకారులు వారి అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు తెలిపినట్లు సమాచారం. కాగా, ఒకరిద్దరు ఉద్యమకారులు మాట్లాడుతూ.. రెండుసార్లు ఎంపీగా చేసిన పసునూరి దయాకర్‌ను సైతం టికెట్ రేసు నుంచి తప్పుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈ భేటీ బీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది.

నేడు ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

వడ్డెపల్లి, మార్చి 9: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా 5 నెలల పాటు వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు హనుమకొండ వడ్డెపల్లి లోని షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి బి.నిర్మల, స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకుడు డాక్టర్ కొంగర జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌పై ఫొటో సరిగా ముద్రితం కాకుంటే ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయంలో బ్లాక్‌పెన్ మాత్రమే వాడాలని, పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ఆధార్‌కార్డు తీసుకొని గంట ముందుగానే హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ : 95428 34507 లో సంప్రదించాలని కోరారు.

ఉచిత ఫిట్‌నెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ఆర్మీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఉచిత ఫిట్‌నెస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కేవీఆర్ ఫిట్‌నెస్ సెంటర్ ట్రైనర్ కీసరి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 9133224565 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. శిక్షణ తరగతులు ఈ నెల 13 నుంచి వరంగల్ ఓసిటీ గ్రౌండ్‌లో ప్రారంభం అవుతాయని తెలిపారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యాక్సిస్ బ్యాంకులో ఖాళీగా ఉన్న బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్జిక్యూటివ్స్‌గా ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 28 యేళ్ల వయస్సు కలిగి ఏదేని డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉండి అర్హులైన వారు ఈ నెల 13న నిర్వహించే జాబ్ మేళాకు ఉదయం 11గంటలలోపు ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

17న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 9: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 17న హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 2009 జనవరి 1లోపు జన్మించిన వారు ఇందులో పాల్గొనవచ్చని కన్నా తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9059522986లో సంప్రదించాలని తెలిపారు.

పేకాట కేంద్రంపై దాడి

వరంగల్ క్రైం, మార్చి 9: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్‌లో ఒకరి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్, ఎస్ఐ శరత్ ఆధ్వర్యంలో దాడి చేశారు. శనివారం నిర్వహించిన దాడిలో రూ.24వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

కారు బేజారు

- రోజురోజుకూ బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులు
- అడ్డుకట్ట వేయడంలో నాయకత్వం విఫలం



వరంగల్ క్రైం, మార్చి 9: బీఆర్ఎస్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. క్యాడర్ పార్టీని వీడుతున్నా అడ్డుకునే నాయకత్వం కరువైంది. బీఆర్ఎస్‌కు సంస్థాగతంగా నిర్మాణం లేకపోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చవిచూశాక పార్టీ కేడర్ అధికార పార్టీ కాంగ్రెస్ వైపు వెళుతోంది. శాసనసభ ఎన్నికల అనంతరం ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. పదేళ్ల అధికారాన్ని అనుభవించిన పార్టీ నేతలు సైతం ఓటమిని తట్టుకోలేక పదవుల కోసం కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. బడానేతలు భవిష్యత్ కోసం బీఆర్ఎస్‌ను వీడుతుండగా, వారి వెంట కేడర్ అంతా వలస బాట పడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ మనుగడ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పదేళ్ల అధికారాన్ని అనుభవించిన బీఆర్ఎస్ నేతలు.. అధికారం లేకుండా ఉండలేకపోతున్నారు. అధికారం కోల్పోయిన నెలరోజుల్లోనే బీఆర్ఎస్‌ను వీడుతున్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ నియోజకవర్గాలున్నాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాల్లో ములుగులో కాంగ్రెస్ విజయం సాధించగా, మిగతా 11 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. ఆరు జిల్లాల జడ్పీలు, మండల పరిషత్‌లు సైతం బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. రెండు ఎంపీ స్థానాలు సైతం బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. కాగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 12లో కేవలం రెండు (స్టేషన్ ఘనపూర్, జనగామ) మినహా 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అధికారంలో లేని బీఆర్ఎస్‌లో ఆపార్టీ క్యాడర్ ఉండలేకపోతున్నారు. పదవులు పదిలం చేసుకునేందుకు, భవిష్యత్‌లో పదవులు పొందేందుకు కాంగ్రెస్ బాటపడుతున్నారు. మూడు మాసాల్లోనే నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లాయి. వరంగల్ కార్పొరేషన్ మేయర్‌తో పాటు వరంగల్ తూర్పులోని 15మంది కార్పొరేటర్లు, పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎన్నికలకు ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ పార్టీని వీడారు.

తాజాగా శనివారం డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆయన సతీమణి ఐనవోలు ఎంపీపీ మధుమతి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఐనవోలు, వర్ధన్నపేట మండలాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రేపో మాపో వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 10మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వీరు స్థానిక ఎమ్మెల్యే నాగరాజుతో మాటాముచ్చట మాట్లాడుకున్నారు. శాసనసభ ఎన్నికల ముందే భూపాలపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మొత్తంగా బీఆర్ఎస్ క్యాడర్ అంతా కాంగ్రెస్ బాటపడుతుండటం విశేషం.

అడ్డుకునే నాయత్వం లేదు

కేడర్ ఖాళీ అవుతున్నా పట్టించుకునే నాయకత్వం కరువైంది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు సంస్థాగతంగా పటిష్టమైన నిర్మాణం లేకపోవడం పార్టీకి నష్టం చేకూర్చుతోంది. జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు ఎమ్మెల్యేలకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్న అధిష్ఠానం కిందిస్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేయలేదు. ఉద్యమ సమయంలో నియమించబడిన కమిటీలే ప్రస్తుతం చెలామణి అవుతున్నాయి. వీరికి సరైన గుర్తింపు లేకపోవడంతో కేడర్‌ను పట్టించుకున్న పాపానపోవడం లేదు. మూడు మాసాలుగా పెద్దఎత్తున బీఆర్ఎస్ కేడర్ కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తుంటే కనీసం వద్దు అనే నేత కరువయ్యాడు. జిల్లా పార్టీ అధ్యక్షులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీ మారే వారితో చర్చించి బరోసా ఇచ్చే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఎమ్మెల్యేలుగా ఓటమి చెందిన అధ్యక్షులు పక్క చూపులు చూసే పరిస్థితి బీఆర్ఎస్‌లో నెలకొంది. వీరు కేడర్‌ను పట్టించుకునే స్థితి లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా బీఆర్ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.

ఈ సారైనా 'గూడు' కుదిరేనా?

(5వ పేజీ తరువాయి)

ఇళ్లు కూడా ఒకటి. ఈ నెల 11వ తేదిన సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. సొంత స్థలంలో కనీసం 400 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇంటికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటిం చింది. నాలుగు విడతల్లో ఈ ఆర్థిక సాయం లబ్ధిదా రులకు అందనుంది. మొదటి బేస్‌మెంట్ స్థాయిలో రూ.1లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి రానుంది. అలాగే పైకప్పుకు మరో లక్ష రుపాయలు, ఆ తరువాత గోడల నిర్మాణం పూర్తి అయినా తరువాత మరో రూ.2లక్షలు సాయం అందించనున్నారు. ఇంటి నిర్మాణం మొత్తం పూర్తి అయినా తరువాత మిగతా రూ.1లక్ష కూడా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. ఎలాంటి ఇల్లు లేని, తెల్లరేషన్‌కార్డు ఉన్న నిరుపేదలే ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. గుడిసెలు, మట్టి గోడల ఇల్లున్న వారు కూడా ఇందిరమ్మ పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే సొంత జాగా లేని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో భాగంగా జాగతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. సోమవారం ప్రారంభమయ్యే ఇందిరమ్మ ఇళ్ల పథకంతో తమ సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో అర్హులైన పేదలు ఉన్నారు.

సీపీఐలోకి వేల్పుల సారంగపాణి


సీపీఐలో చేరినవారితో సాంబశివరావు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి9: హనుమకొండకు చెందిన కార్మిక సంఘం నాయకుడు వేల్పుల సారంగపాణితోపాటు పలువురు నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో సీపీఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హనుమకొండలో కార్మిక సంఘం నాయకుడిగా పనిచేస్తున్న సారంగపాణి పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో సారంగపాణితో పాటు కోమటి రమేష్, గండు సత్యంలు సీపీఐలో చేరారు.

సీపీఎం నుంచి సారంగపాణి బహిష్కరణ

వరంగల్ కార్పొరేషన్: సీపీఎం పార్టీ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు వేల్పుల సారంగపాణిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ సీపీఎం జిల్లా అధ్యక్షుడు బొట్ల చక్రపాణి శనివారం ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణ పనులకు వ్యతిరేకంగా పని చేసిన వేల్పుల సారంగపాణిని బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి సీపీఎం పార్టీకి సారంగపాణికి ఎటువంటి సంబంధం లేదని పార్టీ సభ్యులు, నాయకులు గమనించాలని చక్రపాణి సూచించారు.

యువతి ఆత్మహత్య



కాజీపేట, ఫిబ్రవరి 9: పీహెచ్‌డీ ఎక్కడ చేయాలో తేల్చుకోక, తీవ్ర మనస్థాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన బల్గూరి వేణుగోపాల్ - వకుల దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు బల్గూరి బ్రిందా (28)కు ఇండియాలో, అమెరికాలో పీహెచ్‌డీ సీటు వచ్చింది. పీహెచ్‌డీ ఎక్కడ చేయాలో తేల్చుకోక తీవ్ర మనస్థాపానికి గురై గదిలోకి వెళ్లి శుక్రవారం రాత్రి ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు. తండ్రి వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగులపై హరీష్‌రావు వ్యాఖ్యలు సరికావు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ఉద్యోగులపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సరికావని జీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మె ఉద్యోగుల కారణంగానే విజయవంతమైన సంగతి గుర్తు చేశారు. అలాంటి విషయాలను మరిచి మాజీ మంత్రి హరీష్‌రావు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులను గౌరవించాల్సిందే కానీ.. ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్రను మరవద్దని హితవు పలికారు. వేతన బిల్లులు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ బిల్లులు, జీపీఏ రుణాలు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన వారి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అప్పటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి సహకరించిన సంగతిని గుర్తు చేశారు. హరీష్‌రావు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బంగారం ఎరచూపి డబ్బులతో ఉడాయింపు

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన ● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బయ్యారం, మార్చి 9 : తాను ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తానని, తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి పలువురిని మోసం చేసి డబ్బులతో ఉడాయించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చోక్లాతండాలో ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చోక్లాతండాకు చెందిన సాయి అనే వ్యక్తి కొంత కాలంగా ఇతర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఏడాది కిందట చోక్లాతండాకు వచ్చిన సాయి.. క్రమేపీ సమీప బంధువులు, సుపరిచితులను మచ్చిక చేసుకుంటూ వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు.

ఈ క్రమంలోనే తాను ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తానని.. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ నమ్మబలుకుతూ పలువురి దగ్గర నుంచి అందినకాడికి దండుకున్నాడు. కొందరు అప్పులు చేసి డబ్బులు ముట్టజెప్పగా.. మరికొందరు ఆశకొద్ది పాత బంగారం తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. చోక్లాతండాతో పాటు సమీప గ్రామాలతో కలుపుకొని దాదాపు 10మంది వ్యక్తుల నుంచి సుమారు రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. రెండు నెలలుగా చోక్లాతండాకు సాయి రాకపోవటం, ఎక్కడ ఉన్నాడనే సమాచారం కూడా స్పష్టంగా తెలియకపోవటంతో అనుమానం వచ్చిన బాధితులు.. శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయమై బయ్యారం ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా.. సాయి అనే వ్యక్తి తమను మోసం చేసి డబ్బులతో ఉడాయించినట్లు పలువురు బాధితులు పేర్కొన్నారన్నారు. దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని త్వరలోనే అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు.

దర్దెపల్లి ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి, మార్చి 9 : మండలంలోని దర్దెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ మంద వీరలక్ష్మీ, మాజీ సర్పంచ్ మంద సోమయ్యతో పాటు మరో 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరిన అందరినీ కాపాడుకుంటానని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల వరకు పాలకుర్తిలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, జల్లం కుమారస్వామి, దండయ్య, భాస్కర్, హరీశ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 9: రైలు నుంచి జారిపడి స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన సాంబారి శ్రీనివాస్ అనే వ్యక్తి రెండు కాళ్లు కోల్పోయాడు. స్థానికులు, రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలులో బోగిడోర్ వద్ద కూర్చున్న శ్రీనివాస్ స్టేషన్‌ఘన్ పూర్‌కు రాగానే జారిపడ్డాడు. దీంతో రెండు కాళ్లు రైలు చక్రాల కింద పడి నుజ్జునుజ్జయ్యాయి. గమనించిన స్థానికులు, రైల్వే సిబ్బంది వెంటనే 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. శాతవాహన రైలుకు ఘన్‌పూర్‌లో హాల్టింగ్ లేకపోవడంతో స్టేషన్‌లో వేగం తక్కువగా ఉందని భావించిన బాధితుడు రైలు దిగే ప్రయత్నం చేసే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

నేడు ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో వార్షికోత్సవం

జనగామ కల్చరల్, మార్చి 9: జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ సి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఏకశిల బీఈడీ కళాశాలలో జరిగే వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీఈవో కె.రాము, మునిసిపల్ చైర్‌పర్సన్ పి.జమున హాజరవుతారని ఆయన తెలిపారు.

చోరీ ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

చిలుపూర్, మార్చి 9: బ్రాందీ షాపులో నగదును అపహరించిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రాజశేఖర్, మారుతి, రాజేశ్ అనే ముగ్గురు వ్యక్తులు చిన్నపెండ్యాల సత్య వైన్స్‌లో క్యాషియర్లుగా పని చేస్తున్నారు. కాగా, వీరంతా పథకం ప్రకారం కొద్ది రోజుల నుంచి వైన్స్‌కు చెందిన రూ.8 లక్షల నగదును ఫోన్ పే, గూగుల్ పే రూపంలో వారి వారి స్నేహితులకు బదిలీ చేశారు. అయితే రోజువారి విక్రయాలకు, వచ్చిన నగదుకు మధ్య తేడా రావడంతో విషయం గుర్తించిన యాజమానులు వారిని నిలదీశారు. షాపు యాజమాని మారబోయిన పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

వరంగల్ ఎంపీ టికెట్ ఇందిరకు ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 9: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అట్టడుగు స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎంతో అభివృద్ధి చేసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిరకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఫోరం మండలాధ్యక్షుడు సింగపురం దయాకర్ కోరారు. శనివారం డివిజన్ కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ కనుమరుగు అయ్యే పరిస్థితికి వచ్చిన క్రమంలో పార్టీ పగ్గాలు చేపట్టి పార్టీని అభివృద్ధిలోకి తీసుకువచ్చిన ఘనత ఇందిరది అని కొనియాడారు. 8 ఏళ్లుగా నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తిని గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇందిరను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండె మల్లేషం, చాడ స్వామి, సింగపురం ప్రతీష్, అంగడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

జనగామ కల్చరల్, మార్చి 9: ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రం లోని ఉమాపతి భవన్‌లో జరిగిన టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్ డీఏలను ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. టెట్ మినహాయిస్తూ జోన్-2 లో ఆగిపోయిన పదోన్నతుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మయ్య మాట్లాడుతూ బదిలీల కోసం ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని, బదిలీలు సత్వరమే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కుర్రెముల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లనాగుల రాజు, సభ్యులు సునంద, వజ్రయ్య, అంకుషావలి, శ్రీహరి, వెంకన్న, శ్రీరామ్ పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్నకు పెద్దపట్నం

యాదవ సంప్రదాయం ప్రకారం వైభవంగా లగ్గం ● పసుపు మయమైన తోట బావి ప్రాంగణం



మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో పెద్ద పట్నం వేసిన ఒగ్గు పూజారులు

కొమురవెల్లి, మార్చి 9: కొమురవెల్లి మల్లికార్జున స్వామికి అత్యంత వైభవంగా పెద్ద పట్నం వేశారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున తోట బావి ప్రాంగణం వద్ద యాదవుల సంప్రదాయ ప్రకారం మల్లన్న కు ఘనంగా లగ్గం నిర్వహించారు. ఇదే సమయానికి గర్భగుడిలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపి మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పల్లకిలో ఊరేగించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి తోట బావి ప్రాంగణంలో ఒగ్గు పూజారులు పెద్ద పట్నం వేశారు. ఒగ్గు పూజారుల సంఘం సభ్యులు150 మంది 41 వరుసలతో పట్నాన్ని అత్యంత కళా నైపుణ్యంతో తీర్చిదిద్దారు. నిమ్మకాయతో చిత్ర కన్న నెలకొల్పి పట్నం వేసేందుకు పసుపు, కుంకుమ, తెల్ల పిండి, పచ్చ సునేరు ఉపయోగించారు. ఆనవాయితీ ప్రకారం స్వామివారికి కోనేరులో తెప్ప స్నానం, సుంకు పట్టి, మైలపోలు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు మల్లికార్జున స్వామి కథను వినిపించారు. పూజారులు ఊరేగింపుగా పోతరాజుల వేషధారణలో విన్యాసాలతో అలరించారు. స్వామి ధరించే డమరుకం త్రిశూలాలను నెలకొల్పి మల్లన్న బోనాలను, స్వామి పట్నంపై పెట్టి నైవేద్యం సమర్పించారు. పట్నానికి నలువైపులా గుమ్మడికాయలు, నిమ్మకాయలతో బలిహరణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో స్వామివారి గర్భగుడి నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి యాదవ సంప్రదాయం ప్రకారం కల్యాణం జరిపించారు. పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించారు. అప్పటివరకు అత్యంత భక్తి శ్రద్ధలతో పెద్దపట్నాన్ని తిలకించి, మల్లన్న జీవిత చరిత్రను ఒగ్గు కళాకారుల ద్వారా ఆలకించిన భక్తజనమంతా స్వామిని స్మరిస్తూ పట్నం పైనుంచి నడిచి భక్తిని చాటుకున్నారు. పట్నం కోసం వాడిన పంచవర్ణాల మేలమితమైన పసుపు కుంకుమలను తీసుకుని నేరుగా ఆలయంలో మల్లికార్జున స్వామి దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

బారికేడ్లపై నుండి దూకిన భక్తులు..

అత్యంత భక్తి శ్రద్ధలతో మల్లన్న పట్నాన్ని తొక్కడానికి వచ్చిన భక్తులు తొందరగా వెళ్లాలని భావించిన కొందరు సుమారు 10 అడుగుల ఎత్తుఉన్న బారికేడ్ల పైనుంచి పట్నం పైకి దూకారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పి అదుపు చేశారు. జిల్లా అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట హుస్నాబాద్ ఏసీపీలు మధు, వాసాల సతీష్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ ఎల్ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. శనివారం ఉదయం పెదపట్నం ముగిసిన అనంతరం వీరశైవ అర్చకులు గర్భాలయ మూల విరాట్ ముందు ఉన్న శివలింగానికి అన్నంతో అలంకరించి ఏకాదశ రుద్రాభిషేకం, మహా అన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, స్తనాచారి మల్లయ్య, మహదేవుని సాంబయ్య అర్చకులు పాల్గొన్నారు.



స్వామివారికి మహా అన్నపూజ చేస్తున్న పూజారులు

ఆగని దొంగతనాలు

- ఒకే రోజు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ
- బచ్చన్నపేట మండలంలో కొనసాగుతున్న వరుస సంఘటనలు
- చోద్యం చూస్తున్న పోలీసులు



ఆలీంపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్లిన దొంగలు

బచ్చన్నపేట, మార్చి 9: బచ్చన్నపేట మండలంలో వరుస దొంగతనాలు కలవరపెడుతున్నాయి. వ్యవసాయ బావుల వద్ద స్టార్టర్ల నుంచి మోటర్లకు వెళ్లే కేబుల్‌ను గత రెండు మాసాలుగా దొగలు ఎత్తుకెళుతున్నారు. శుక్రవారం రాత్రి ఏకంగా ఆలీంపూర్ శివారులోని శ్రీపతి రవి, ఎలికట్టె నర్సింహులు, ఎలికట్టె కృష్ణకి చెందిన వ్యవసాయ బావుల వద్ద గల మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను అపహరించారు. రెండు మాసాలుగా పోలీసులకు చిక్కకుండా దొంగలు, తెలివిగా తమ చేతివాటం చూపుతున్నారు. ఇలాంటి సమయాల్లోనే దొంగలను గుర్తించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం పనిచేయకపోవడం దొంగలకు కలిసి వస్తోంది. పోచన్నపేట, బచ్చన్నపేట, కొడవటూరు శివారు, చిన్నరామన్‌చర్ల తదితర గ్రామాల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో కేబుల్ వైర్లు కత్తిరించుకు వెళ్లారు. అసలే ఎండలు మండిపోతుండటంతో ఓవైపు పొలాలు ఎండి పోతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులను టార్గెట్‌గా చేసుకుని దుండగులు వ్యవసాయ బావుల వద్ద కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్‌లలో వైర్లు చోరీ చేస్తుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఒక్క పంపుసెట్ వైరు కత్తిరించుకు వెళితే రైతుకు రూ. 10 వేలు నష్టం జరుగుతోంది. అంతేకాకుండా నీటి తడులు తగ్గి చేలు ఎండుతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తక్షణమే చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ధ్వంసమైన మూడు ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు రూ.4.50 లక్షల వరకు ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

హరీశ్‌రావుకు ఉద్యోగులపై అక్కసెందుకు?

జనగామ టౌన్, మార్చి 9: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తన మాటల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులపై అక్కసు వెళ్లగక్కుతున్నారని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్(ట్రెంగా) రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి విమర్శించారు. శనివారం జనగామలో ఆయన మాట్లాడుతూ రైతుబంధు డబ్బుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసే క్రమంలో హరీశ్‌రావు ఉద్యోగులపై అనుచితంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. తాము ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఆపి రైతుబంధు వేశామని చెప్పడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇస్తుంటే హరీశ్‌రావు ఓర్వలేకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పట్టల విజయ్‌బాబు, గౌరవాధ్యక్షుడు మాచుపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత వెంకట్‌రెడ్డి మృతి

సంతాపం తెలిపిన పార్టీ శ్రేణులు



జఫర్‌గడ్, మార్చి 9: సీపీఐ సీనియర్ నాయకుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మినేటి వెంకట్‌రెడ్డి (72) శనివారం మృతి చెందారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు పార్టీ ప్రతినిధులు తెలిపారు. వెంకట్‌రెడ్డికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. జఫర్‌గడ్ మండలం రఘునాథ్‌పల్లికి చెందిన వెంకట్‌రెడ్డి సుమారు నాలుగు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం సాగించాడు. పార్టీ కార్యకర్త స్థాయి నుంచి మండల, జిల్లా పార్టీ, అనుబంధ రైతు, కార్మిక సంఘాల్లో పని చేసి కార్యక్రమాల విజయవంతానికి, పార్టీ విస్తృతికి విశేష కృషి చేశాడు.. వెంకట్‌రెడ్డి మృతి పట్ల సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్, అనుబంధ సంఘాల మండల కమిటీల ప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

నేడు పట్టణంలో కరెంట్ బంద్

జనగామ టౌన్, మార్చి 9: జనగామ పట్టణంలో ఆదివారం మూడు గంటల పాటు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శంకర్ ప్రకటించారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు ఉండదని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జిగా నూకల బాల్‌రెడ్డి

26 గ్రామ కమిటీల అధ్యక్షుల ప్రకటన



బచ్చన్నపేట, మార్చి 9: కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జిగా లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన నూకల బాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా గ్రామాల వారి అధ్యక్షులుగా పోకాల కర్ణాకర్ (ఆలీంపూర్), మహాత్మాచారి (బచ్చన్నపేట టౌన్), ఇప్ప శ్రీధర్‌రెడ్డి (బండనాగారం), బాలగోని కనకయ్య (బసిరెడ్డిపల్లి), బోదాసు స్వామి (బోనకొల్లూరు), నిమ్మ కరుణాకర్ రెడ్డి (చిన్నరామన్‌చర్ల), రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి (దబకుంటపల్లి), నర్సింహులు (గంగాపూర్), నగేష్ (గోపాల్‌నగర్), ఎన్ కిష్టయ్య (ఇటుకాలపల్లి), పుట్ట నర్సింహులు (కట్కూరు), బాల్నే రమేశ్ (కేశిరెడ్డిపల్లి), మల్లం శ్రీనివాస్ (కొడవటూరు), సిద్దిరాములు (కొన్నె), ప్రవీణ్ (లక్ష్మాపూర్), అన్నెబోయిన సత్తయ్య (లింగంపల్లి), గజ్జి సత్తయ్య (మన్‌సాన్‌పల్లి), కుక్కల రాములు (నాగిరెడ్డిపల్లి), బోడపట్ల ఐలయ్య (నక్కవానిగూడెం), పరిదె శ్రీనివాస్ (నారాయణపూర్), చల్లా సంతోష్‌రెడ్డి (పడమటికేశ్వాపూర్), అక్కిరెడ్డి శ్రీధర్(పోచన్నపేట), నర్మెట అంజనేయులు (రాంచంద్రాపూర్), బత్తిని వెంకటేశ్ (సాల్వాపూర్), శ్రీనివాస్‌రెడ్డి (తమ్మడపల్లి), వంగ సురేందర్‌రెడ్డి (వీఎస్ఆర్‌నగర్)ల పేర్లను ప్రకటనలో వెలువరించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్‌గా నియమితులైన బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

జనగామ టౌన్, మార్చి 9: తిరుమలగిరికి చెందిన కామిండ్ల మహేశ్ 2023 డిసెంబర్ 11న జనగామ మండలం చంపక్‌హిల్స్ వద్ద తన స్మార్ట్ ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్‌ను పట్టుకుని శనివారం మహేశ్‌కు అప్పగించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రఘునాథపల్లి, మార్చి 9: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామం కురుమవాడలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరయిన రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను మండల కో-ఆప్షన్ మెంబర్ ఎం.డి.షబ్బీర్ మియా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మేకల నరేందర్, గంగిడి లక్ష్మా రెడ్డి, పోకల శ్రీనివాస్, ఎం.డి.గౌస్ పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా హుస్సేన్‌నాయక్



మహబూబాబాద్ రూరల్, మార్చి 9 : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల తావుర్యాతండాకు చెందిన బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ ఆర్.జయ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హుస్సేన్‌నాయక్ బీజేపీ ద్వారా రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో, 2019లో పార్లమెంట్ ఎన్నికల్లో, మళ్లీ 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయనను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించింది.

వైభవంగా మల్లన్న స్వామి ఉత్సవాలు



ఉమానీలకంఠ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న ఒగ్గు పూజారులు,



అబ్దుల్‌నాగారంలో పెద్దపట్నం ముందు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

జఫర్‌గడ్, మార్చి 9 : మండలంలోని తిమ్మంపేటలో కొండపై గల శ్రీమల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం స్వామి వారి ఆలయ ఆవరణలో ఆలయ అర్చకులు, ఒగ్గు పూజారుల నేతృత్వంలో మల్లన్న స్వామి కళ్యాణమహోత్సవం నయనానందకరంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా బండ్లు తిరుగుట, పెద్ద పట్నం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉగ్రదండి పుణ్యమూర్తి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జఫర్‌గడ్‌లోని ఉమానీలకంఠ శివాలయంలో స్వామి వారి కల్యాణం అనంతరం శనివారం తెల్లవారు జామున శివపార్వతుల రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు యెల్లంబట్ల శశిధర్‌శర్మ, కమిటి ప్రతినిధుల నేతృత్వంలో శివరాత్రి వేడుకలు వైభవంగా సాగాయి. పురవీధుల గుండా రథంపై ఊరేగుతున్న శివపార్వతుల ఉత్సవ మూర్తులను మహిళలు, భక్తజనులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

తరిగొప్పుల: మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని అబ్దుల్‌నాగారం గ్రామ శివారులోగల శ్రీ పంగిడి మల్లికార్జునస్వామి కల్యాణం ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఆలయప్రాంగణం హరహర శంభో నామస్మరణతో ప్రతిధ్వనించింది. శనివారం ఉదయం ఒగ్గు పూజారులు భక్తి ప్రపత్తులతో వేసే పెద్దపట్నాన్ని, స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు శుక్రవారం రాత్రి 11 గంటలలోపే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. శనివారం ఉదయం ఒగ్గు పూజారులు స్వామివారిని గంగస్నానానికి తీసుకెళ్లి పసుపు కుంకుమలతో పెద్దపట్నం వేసి భక్తుల సన్నిధిలో కమనీయంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం మాజీ సర్పంచ్ అర్జుల రమ సంపత్ రెడ్డి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు కళాకారుల సంఘం నేత బెల్లపు పరమేశ్వర్, నర్సయ్య, గట్టుమల్లయ్య, కనుకయ్య, బాలకొమురయ్య, అయిలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తాం

బీజేపీ మండల ఇన్‌చార్జి గట్టు కృష్ణ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న గట్టు కృష్ణ గౌడ్

జఫర్‌గడ్, మార్చి 9: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తుందని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి గట్టు కృష్ణగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం జఫర్‌గడ్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం, వివిధ పథకాల అమలుకు నిధులను మంజూరు చేసిందన్నారు. కేంద్రం చేపడుతున్న పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కంకణబద్ధులై పని చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, సురేశ్ గౌడ్, తిరుపతి, వినయ్‌యాదవ్, మేరుగు రామరాజు, గాదెపాక శ్రీను, సంపత్‌రెడ్డి, పల్లె సంతోష్‌రెడ్డి, సింగపురం రమేశ్, మేకల పవన్‌యాదవ్, రాజు, యాకస్వామి, సురేశ్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, దుద్దుల చంద్రమౌళి పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి..

పాలకుర్తి: ఈ నెల 12న హైద్రాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే విజయ సంకల్ప మహా సమ్మేళనానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గడ్డం నరేందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడో సారి అధికారంలోకి రావడం ఈ దేశానికి అవసరమన్నారు. అందుకోసం ప్రతీ కార్యకర్త బూత్ లెవల్‌లో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు కొల్పుల శంకర్, దుంపల సంపత్ పాల్గొన్నారు.



చిన్నరామన్‌చర్లలో ఎండిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి: సీపీఎం

బచ్చన్నపేట, మార్చి 9: ఎండిన పంట పొలాలకు ప్రభుత్వం సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ కోరారు. శనివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చిన్నరామన్‌చర్ల, తమ్మడపల్లి, పోచన్నపేట గ్రామాలను సందర్శించి ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో బోర్లపై ఆధారపడి 20 వేల హెక్టార్‌లలో వరి, మక్కజొన్న పంటలు సాగు చేశారని, భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఇప్పటికే వడగళ్ల మూలంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని, అయినా అప్పులు తెచ్చి పంట సాగు చేస్తే ఎండిపోతోందనా అన్నారు. ప్రభుత్వం ఎండిన పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిశీలన బృందంలో నాయకులు మినలాపురం ఎల్లయ్య, రామగళ్ల అశోక్, అన్నెబోయిన శ్రీనివాస్, సుధాకర్, రాజు, బాల్‌నర్సయ్య, నాగరాజు, కనకయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



నాయిని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నర్మెట, మార్చి 9 : మండలంలోని మచ్చుపహాడ్ గ్రామంలోని గుట్టల్లో వెలసిన శ్రీనాయిని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శివ పూజలు నిర్వహించగా రెండవ రోజు శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. పూజారి ప్రయాగ నాగభూషణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ రామిని శివరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి, నాయకులు పరీదుల యాదయ్య, భూక్య జయరాం, కొంపెల్లి రాజు, బుర్ర రాజు, ప్రజ్ఞాపురం శ్రీధర్, లింగాల రమేష్, నాగపూరి రాజు, మహిళలు పాల్గొన్నారు.

శివాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



దాతలు సోమేశ్వర్‌శ్రావ్య దంపతులను సన్మానిస్తున్న కమిటి ప్రతినిధులు

జఫర్‌గడ్, మార్చి 9: మండల కేంద్రంలోని శ్రీఉమానీలకంఠ స్వామి ఆలయ అభివృద్ధి కోసం స్థానిక వ్యాపారి దాంశెట్టి సోమేశ్వర్‌శ్రావ్య దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న సోమేశ్వర్ మాట్లాడుతూ శివాలయ అభివృద్ధికి ఓ భక్తుడిగా స్పందించి లక్ష రూపాయలు వెచ్చిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు, సన్మానించారు.

నవాబుపేటలో స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న నవాబుపేట విద్యార్థులు

లింగాలఘణపురం, మార్చి9: మండలంలోని నవాబుపేట జడ్పీహైస్కూల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలను బోధించారు. అడ్మినిస్ట్రేస్‌గా రిషిక, నోడల్ ఆఫీసర్‌గా అర్చన, డీఈవోగా చందు, ఎస్ఎంసీ చైర్మన్‌గా భాను వ్యవహరించారు. ప్రతిభను చాటిన విద్యార్థులకు హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, మల్లేశం, రమేశ్ అభినందించి బహుమతులను అందజేశారు.